సాక్షి రంగారెడ్డి

బుధవారం । 23 । ఆగస్టు । 2023



సాగులో ఇజ్రాయిల్ ఆదర్శం

ఆధునిక టెక్నాలజీతో ఇజ్రాయిల్‌వాసులు నాణ్యమైన పంటలు పండిస్తున్నారని ఉద్యాన అధికారి సునందారాణి అన్నారు. 10లో▸



ఆ పాలనకు చరమగీతం

తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస్ అన్నారు. 10లో▸



బైక్ దొంగలకు రిమాండ్

పార్క్ చేసిన వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 10లో▸

న్యూస్‌రీల్

108లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం



షాద్‌నగర్: 108 వాహనాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రాం జిల్లా మేనేజర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంఆర్‌ఐ సంస్థలో పైలెట్స్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా జిల్లాలో పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో హయత్‌నగర్‌లోని 108 కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పైలెట్స్‌కు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత, బ్యాడ్జ్ డ్రైవింగ్ లేదా హెవీ లైసెన్స్‌తో రెండేళ్ల అనుభవం ఉండాలని, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు బీఎస్సీ, లేదా లైఫ్ సైన్స్ గ్రూపు, బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల జీరాక్స్‌లను తీసుకురావాలని కోరారు. మరింత సమాచారం కోసం 91542 48818 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆదర్శ కళాశాలలో ప్రవేశాలు

చేవెళ్ల: మండలకేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లలో అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టీనావతి చెప్పారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్లలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందు అవకాశం ఉందని తెలిపారు.

గ్రూప్-2కు ఉచిత కోచింగ్



ఇబ్రహీంపట్నం రూర ల్: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ విద్యార్థులకు గ్రూప్-2 సర్వీస్ ని యామకం కోసం 45 రోజులు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ ఆధార్‌కార్డు, విద్యా ధ్రువీకరణ పత్రాల కాపీలతో పాటు వారి బయోడేటా పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించాలన్నారు. ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకొనే పేద మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకం ఉపకార వేతనాన్ని పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే విద్యార్థులు ఎంపిక చేయబడిన విదేశాల్లోని యూనివర్సిటీల్లో జనవరి 1, 2023 నుంచి 31 జూలై 2023 వరకు ప్రవేశం పొంది ఉండాలన్నారు. అర్హత గల వారు 21 సెప్టెంబర్ 2023 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధునిక హంగులతో గ్రంథాలయాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి



చేవెళ్లలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలం పరిశీలన

చేవెళ్ల: ఆధునికహంగులతో చేవెళ్లలో నూతన లైబ్రరీ భవనాన్ని అందుబాటులోకి తెచ్చి ఉద్యోగ సాధన కేంద్రంగా తీర్చిదిద్దుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు.మండలకేంద్రంలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. జిల్లాలో రూ.18కోట్ల వ్యయంతో గ్రంథాలయలకు అధునాతన భవనాలు నిర్మించటమేకాకుండా సకల వసతులు కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలను జిల్లా వ్యాప్తంగా లైబ్రరీల్లో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆయన వెంట సీనియర్ లైబ్రేరియన్ సత్యనారాయణ,ఏఈఓ శ్యాం, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కమ్యూనిస్టుల దారెటు?

- 'పట్నం'పై సీపీఎం నజర్
- బీఆర్ఎస్‌తో పొత్తుంటే సీటు అడగాలని యోచన
- అభ్యర్థిని ప్రకటించడంతో అయోమయం
- ఆవిరైన నేతల ఆశలు



ఇబ్రహీంపట్నం రూరల్: కమ్యూనిస్టుల ఆశలు అడియాసలయ్యాయి. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు సీట్లు మినహా 115 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వామపక్ష పార్టీలు తర్జనభర్జనలో పడ్డాయి. మునుగోడు ఉప ఎన్నికలో భాగంగా బీఆర్ఎస్‌తో కలిసి పని చేసిన వామపక్ష పార్టీలకు భంగపాటు తప్పలేదు. నిన్న మొన్నటి వరకు పొత్తు ఉంటుందని భావించాయి. సీఎం కేసీఆర్ ఒకేసారి పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించడంతో ఆశలు ఆవిరయ్యాయి.

ఇబ్రహీంపట్నం సీటుపై గంపెడాశలు..

పొత్తులో భాగంగా సీపీఎం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్‌ను తీసుకోవాలని భావించింది. ఏడాది కాలంగా నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలను జోరుగా సాగించింది. సీపీఎం రాష్ట్ర మహాసభలను సైతం తుర్కయంజాల్‌లో నిర్వహించి పెద్ద ఎత్తున ప్రచారం సాగించింది. గతంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పాషా నరహరి హత్య అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కొండిగారి రాములు 1989, 1994లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో మస్కు నర్సింహ సీపీఎం నుంచి విజయం సాధించారు. జిల్లాలో ఆ పార్టీకి ఇబ్రహీంపట్నం కంచుకోటగా ఉండేది. బీఆర్ఎస్‌తో పొత్తుపొడిస్తే తప్పనిసరి ఈ సీటు అడగాలని భావించారు. కానీ హ్యాట్రిక్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేరునే మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో కంగుతిన్నారు.

ఆలోచనలో పడ్డ వామపక్షాలు..

నియోజకవర్గంలో వామపక్షాలకు 2018లో 9వేలకు పైచిలుకు ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలోనే సీపీఎం పోటీ చేసిన నియోజకవర్గాల్లో అత్యధిక ఓట్లు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనే వచ్చాయి. అదే బలంతో ప్రజా పోరాటాలు చేస్తూ ప్రజల్లో ఉన్నారు. ఈసారి ఎలాగైనా పోటీ చేయాలని భావించినా బీఆర్ఎస్‌తో పొత్తు కుదరకపోవడంతో ఆలోచనలో పడ్డారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తారో, లేక సొంతంగా పోటీ చేస్తారో వేచి చూడాలి.

చేవెళ్ల బరిలో ఉంటా

- ఇప్పటికీ న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది
- పోటీలో మాత్రం తప్పనిసరి
- పార్టీ మార్పుపై ఇప్పుడే చెప్పలేను
- 'సాక్షి'తో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాజీ ఎమ్మెల్యే రత్నం

చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ టికెట్ ఇస్తారనే నమ్మకం చివరి వరకు తనకు ఉందని.. ఎమ్మెల్యేగా పోటీలో మాత్రం తప్పకుండా ఉంటున్నానని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. చేవెళ్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. తనను నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకుంటానని చెప్పారు. పార్టీ టికెట్ రాలేదు కదా అని ప్రశ్నించగా కేసీఆర్, కేటీఆర్ న్యాయం చేస్తారనే నమ్మకం ఇప్పటికీ ఉందన్నారు. ప్రస్తుతం పేరు మాత్రమే ప్రకటించారని, బీఫాం ఇవ్వలేదు కదా అప్పటి వరకు చూద్దామన్నారు. తనకు అవకాశం ఉందనే అనుకుంటున్నానని ధీమా వ్యక్తం చేశారు. రెబల్‌గా పోటీ చేస్తారా లేక పార్టీ మార్పు ఉంటుందా అని అడిగిన ప్రశ్నకు ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ న్యాయం చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. పార్టీ మార్పుపై ఇప్పుడు మాట్లాడలేనని చెప్పారు. పార్టీ పెద్దలుగా కేసీఆర్, కేటీఆర్ ఏది చెబితే అది పాటిస్తానని, వారి ఆదేశాల మేరకు నడుచుకుంటానన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



షాబాద్: చందనవెల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

షాబాద్: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన సందర్శించారు. వైద్య సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని, ఓపీ సంఖ్యను పెంచాలని సూచించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారితో యోగా చేయించాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్, డాక్టర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్యసేవలు ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు వ్యాక్సినేషన్, అసంక్రమిత వ్యాధులు అరికట్టడం, టీబీని గుర్తించి సరైన వైద్యం అందించటం, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ సర్వే చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన చేవెళ్లలోని పాలియేటివ్ కేర్ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొయినాబాద్‌లోని పీహెచ్‌సీని సందర్శించి అక్కడి వైద్యసేవలు, రోగుల సంఖ్య తదితరాలను పరిశీలించారు. సమావేశంలో డివిజన్‌లోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సంక్షేమమే ధ్యేయం

- మంత్రి సబితారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభివాణీదేవి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

కందుకూరు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నియోజకవర్గం పరిధిలోని 300 మంది లబ్ధిదారులకు బీసీ బంధు పథకం కింద మంజూరైన రూ.3 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీలకు ఆర్థికంగా అండగా నిలిచేలా బీసీబంధు పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులను అప్పటి ప్రభుత్వాలు నాశనం చేశాయని, సీఎం కేసీఆర్ చొరవ తీసుకుని వారిని గౌరవించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లుగా తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. మరోసారి అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. బీసీలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చేయూతనందిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభివాణీదేవి మాట్లాడుతూ.. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి రెండు సమానంగా కొనసాగుతున్నాయన్నారు. అంతకుముందు మంత్రి చౌరస్తాలోని శ్రీశైలం రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ జి. శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, మహేశ్వరం వైస్ ఎంపీపీ సునీత, వివిధ మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు మంగళవారం సీనియర్ సిటిజన్స్‌కి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎనభై ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు తమ ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును ఎలక్షన్ కమిషన్ కల్పించిందని తెలిపారు. ఇంటి నుంచి ఓటు వేయదల్చుకున్నవారు ఎన్నికల ప్రకటన వెలువడిన మీదట నిర్ణీత ఫారం నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే పోలింగ్ అధికారి నేతృత్వంలో సిబ్బంది వారి ఇంటికి వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తారన్నారు. ఇప్పటికే ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, వీల్‌చైర్ సదుపాయాలు అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు గురించి వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సంగీత, స్వీప్‌నోడల్ అధికారి ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

ఎస్టీపీ నిర్మాణ పనుల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: తుది దశ నిర్మాణంలో ఉన్న ఎస్టీపీలను ట్రయల్ రన్ కోసం సిద్ధం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఫతేనగర్, పెద్ద చెరువు, నల్ల చెరువు, నాగోల్ ఎస్టీపీలను సందర్శించారు. మొత్తం 3 ప్యాకేజీల్లో, 5 సర్కిళ్లలో సుమారు రూ.3,866.41 కోట్ల వ్యయంతో కొత్తగా 31 మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. కొత్త ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే.. నగరంలో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. వీటి ద్వారా రోజూ 1282 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయొచ్చన్నారు.

కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది

- అందుకే రెండు చోట్ల పోటీ
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం
- పార్టీ సీనియర్ నేత హన్మంతరావు



విలేకరులతో మాట్లాడుతున్న హన్మంతరావు

షాద్‌నగర్: సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే వచ్చే ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. వచ్చే నెలలో షాద్‌నగర్‌లో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభకు సంబంధించిన స్థలాన్ని మంగళవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో సీఎం గజ్వేల్‌లో గెలిచే పరిస్థితి లేదని, తన పరువును కాపాడుకునేందుకే కామారెడ్డిలో కూడా పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ వీడతారనే భయంతోనే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి కట్టబెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ఖజానా నింపుకొనేందుకే సీఎం కేసీఆర్ మద్యం దుకాణాలకు ముందస్తు టెండర్లు ఆహ్వానించారన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజల్లో ఎంతో మార్పు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీసీల తడాఖా చూపించేందుకు షాద్‌నగర్‌లో వచ్చే నెల మూడు లక్షల మందితో పెద్ద ఎత్తున బీసీ డిక్లరేషన్ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో అఘాయిత్యం



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్.. వెనక నిల్చుని ఉన్న నిందితులు

- మీర్‌పేటలో బాలికపై అత్యాచారం కేసు కొలిక్కి
- ఏడుగురు నిందితులను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై అత్యాచారం కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి మత్తులో వీరు అఘాయిత్యానికి పాల్పడినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నగరంలోని లాలాపేట శాంతినగర్‌లో నివసించే బాలిక (14) వారం రోజుల క్రితం తన సోదరులతో కలిసి నందనవనంలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఈ నెల 19న మంగళ్‌హాట్, సీతారాంపేటకు చెందిన మెకానిక్ అబేద్ బిన్-ఖాలీద్ అలియాస్ అబేద్ నందనవనం వచ్చాడు. సదరు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక బంధువులు అతడిని మందలించారు. ఈ నేపథ్యంలో 21వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బాలిక తన ఇద్దరు సోదరులతో కలిసి ఇంట్లో ఉంది. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న అబేద్, తన స్నేహితులు తహసీన్ అలియాస్ టైసన్, మహేశ్‌తో కలిసి బాలిక ఉంటున్న ఇంటికి వచ్చారు. బాలికపై అబేద్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత తహసీన్, నందనవనం వాంబే కాలనీకి చెందిన మంకాల మహేశ్ (20), అదే ప్రాంతానికి చెందిన ఎం.నర్సింగ్ అలియాస్ బ్యాంగ్ చిన్నా (23), అష్రఫ్ (20), రసూల్‌పురాకు చెందిన ఎండీ ఫైజల్ (21), ఎండీ ఇమ్రాన్ కత్తితో బెదిరించి సామూహిక అత్యాచారం చేశారు. సమాచారం అందుకున్న మీర్‌పేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రధాన నిందితుడు అబేద్ బిన్ ఖాలీద్‌ను సంతోష్‌నగర్ చౌరస్తాలో అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న మహేశ్, నర్సింగ్, అష్రఫ్, ఎండీ ఫైజల్, ఎండీ ఇమ్రాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న తహసీన్‌ను మంగళవారం రాత్రి ఎస్ఓటీ పోలీసులు మల్కాజిగిరిలో పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు అబేద్ బిన్ ఖాలీద్‌పై ఇప్పటికే మంగళ్‌హాట్ పీఎస్ పరిధిలో రౌడీ షీట్ తెరిచి ఉన్నట్లు ఆయన చెప్పారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, వీరి నుంచి ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో ఎల్బీనగర్, డీసీపీ సాయి శ్రీ పాల్గొన్నారు.

ఇకపై.. లైఫ్ ట్యాక్స్

- మినహాయింపు.. ముగింపు
- కేవలం 8000 వాహనాలకే జీవితకాల పన్ను నుంచి ఊరట
- ద్విచక్ర, ఇతర వాహనాలకు ఇంకా కొనసాగింపు
- గ్రేటర్‌లో 50 వేలకు చేరుకున్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు
- ఆటోలు, వస్తురవాణా వాహనాల అమ్మకాల్లోనూ దూకుడు



సాక్షి, సిటీబ్యూరో: బ్యాటరీ కారు కొనుగోలు చేస్తున్నారా.. ఇక నుంచి జీవితకాల పన్ను చెల్లించాల్సిందే. ఎలక్ట్రిక్ కార్ల కోటా ముగియడంతో అన్ని రకాల వాహనాల్లాగే ఎలక్ట్రిక్ కార్లకు సైతం జీవితకాల పన్ను వసూలు చేసేందుకు రవాణాశాఖ సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసే వాహనదారులు ఇక నుంచి బండి ధరతోపాటు జీవితకాల పన్నును కూడా కొనుగోలు సమయంలోనే చెల్లించాల్సి ఉంటుంది. వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు, పర్యావరణ హిత బ్యాటరీ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను జీవితకాల పన్ను నుంచి మినహాయించిన సంగతి తెలిసిందే. వివిధ కేటగిరీలకు చెందిన వాహనాల డిమాండ్, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని కల్పించారు. 5000 కార్లకు పన్ను నుంచి మినహాయింపునివ్వగా, వాహనదారులు, డీలర్లు, తదితర వర్గాల విజ్ఞప్తి మేరకు రవాణాశాఖ మొదట మరో 2000 వాహనాలకు, ఆ తర్వాత మరో 1000 వాహనాలకు ఆ ప్రోత్సాహక రాయితీని అందజేసింది. దీంతో జీవితకాల పన్నునుంచి మినహాయింపు పొందిన వాహనాల సంఖ్య 5000 నుంచి 8000కు పెరిగింది. ఇక నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కేటగిరీకి చెందిన వాహనాలకు పన్ను నుంచి మినహాయింపును ఇవ్వబోమని, అన్ని రకాల వ్యక్తిగత వాహనాల్లాగే ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసే వాహనదారులు సైతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని రవాణాశాఖ అధికారులు తెలిపారు. మరోవైపు పలు ఆటోమొబైల్ సంస్థలకు చెందిన డీలర్లు మాత్రం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం గమనార్హం. గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు మరిన్ని వాహనాలకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

మరో 90వేల ద్విచక్ర వాహనాలకు అవకాశం..

- నగరవాసులు కొంతకాలంగా బ్యాటరీ ద్విచక్ర వాహనాల పట్ల ఎక్కువ ఆసక్తిని చూపుతున్నారు. కార్లు, ఇతర కేటగిరీలకు చెందిన వాటి కంటే వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. పెరుగుతున్న ఇంధన ధరలు, ఇతర నిత్యావసర వస్తుల ధరలను దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లుతున్నారు. ఈ మేరకు గత రెండేళ్లుగా వీటి వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకు సుమారు 50 వేలకు పైగా ఎలక్ట్రిక్ బైక్‌లు రోడ్డెక్కాయి. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం కార్లతో పాటు 2 లక్షల బైక్‌లకు సైతం జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చింది.
- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా ఇప్పటి వరకు 1,06,668 ద్విచక్ర వాహనాలు ఈ ప్రోత్సాహకాన్ని అందుకొని రోడ్డెక్కాయి. మరో 90 వేలకు పైగా వాహనాలకు పన్ను మినహాయింపు అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఎలక్ట్రిక్ వాహనాలకు సుమారు రూ.220 కోట్లకు పైగా పన్ను మినహాయింపు లభించినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనాల కేటగిరీలో మరో రెండేళ్ల వరకు ఈ రాయితీ లభించే అవకాశం ఉంది. కమర్షియల్ కేటగిరి కింద కొనుగోలు చేసే వాహనాల్లో 25000 ఆటో రిక్షాలకు మినహాయింపునివ్వగా, ఇప్పటి వరకు 18 వేలకు పైగా ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాయి. 10 వేల తేలికపాటి వస్తురవాణా వాహనాల్లో 7 వేలకు పైగా రోడ్డెక్కాయి.

బ్రాండెడ్ వాహనాల వైపే మొగ్గు..

మరోవైపు సమర్థమైన బ్యాటరీలు కలిగిన బ్రాండెడ్ బైక్‌లకే నగరవాసులు మొగ్గు చూపుతున్నారు. గతంలో చోటుచేసుకున్న కొన్ని ప్రమాద ఘటనల దృష్ట్యా ఆటోమోటివ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఏఐఎస్) ధ్రువీకరించిన ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన వాహనాలకు ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుతం వాహనదారుల డిమాండ్ మేరకు లభించడం లేదు. కొన్ని బ్రాండ్‌లకు చెందిన వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కనీసం 3 నెలల పాటు ఎదురుచూడాల్సి రావడం గమనార్హం. గతంలో ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల వరకు మాత్రమే బండి నడిచేది. ఇప్పుడు వంద కిలోమీటర్ల వరకు పరుగులు పెట్టే నాణ్యమైన వాహనాలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

అక్కడ సీఎం
ఇక్కడ ఎమ్మెల్యే

ఇద్దరిదీ కుటుంబ పాలనే

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

- 500 మంది అనుచరులతో కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి

శంకర్‌పల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్, చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన సాగిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్‌రెడ్డితో పాటు మహాలింగపురం గ్రామం నుంచి బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన 500మందితో కలిసి హస్తం గూటికి చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విలువైన ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ సీఎం కుటుంబ వేల కోట్లకు ఎదిగారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమిస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన భూములను లాక్కుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంపీ మాజీ డైరెక్టర్ శ్రీకాంత్, నాయకులు రవీందర్, యూసుఫ్‌ఖాన్, లక్ష్మారెడ్డి, శంకర్, విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రశాంత్, రాములు, సత్యం, దాసు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో ఇజ్రాయిల్ ఆదర్శం

- కార్పొరేట్ విధానంలో ఫామింగ్
- స్టడీ టూర్ వివరాలు వెల్లడించిన జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డాక్టర్ సునందారాణి


ఇజ్రాయిల్‌లో పంటలను పరిశీలిస్తున్న అధికారులు, రైతు బంధు కోఆర్డినేటర్ల బృందం

కందుకూరు: పంటల సాగుకు వనరులు లేకున్నా ఆధునిక టెక్నాలజీ సాయంతో ఇజ్రాయిల్ దేశస్తులు నాణ్యమైన పంటలు పండించి లాభాలు ఆర్జిస్తున్నారని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డాక్టర్ సునందారాణి అన్నారు. స్టడీ టూర్‌లో భాంగా ఈ నెల 5 నుంచి 11వరకు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు బంధు కోఆర్డినేటర్ల బృందం ఇజ్రాయిల్ దేశంలో పర్యటించింది. ఆధునిక పద్ధతులతో అక్కడ సాగు చేస్తున్న పంటలు, మార్కెటింగ్ తదితరాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ పంటల సాగు చేసే విధానం, నీటి పొదుపు తదితర అంశాలను గురించి రైతులకు వివరించారు.

60 శాతం ఎడారే

ఇజ్రాయిల్ దేశంలో 60 శాతం భూమి ఎడారే. మిగతా భూమి పాక్షిక శుష్క. ఎడారి భూమిని సాగుకు యోగ్యమైనదిగా మార్చడానికి అక్కడి ప్రజలు సమన్వయ నీటి విధానాన్ని ఉపయోగించారు. అక్కడి రైతులు సన్న, చిన్నకారు రైతులే. కార్పొరేట్ విధానంలో ఫామింగ్ చేపడుతున్నారు. వర్షపాతం ఏడాదికి కేవలం 150 నుంచి 200 మి.మీ మాత్రమే. నదులు, రిజర్వాయర్లు లేవు. తాగు, సాగు నీరు ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. వ్యవసాయానికి లీటరుకు మన కరెన్సీలో రూ.0.30 పైసలు, తాగునీటికి రూ.0.60 పైసలు వెచ్చిస్తున్నారు. ఇంటిలో వాడిన నీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి మళ్లిస్తున్నారు. సముద్రపు నీటిని శుద్ధి చేసి మిగిలిన అవసరాలకు వినియోగిస్తున్నారు. నీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా ఆటోమేటెడ్ మరియు కంప్యూటరైజ్డ్ సిస్టమ్‌తో పని చేస్తూ పంటకు ఎంత నీరు అవసరమో అంతే అందించేలా పొదుపుగా వాడుకుంటున్నారు.

పంటల సాగు

అక్కడ ఆధునిక పద్ధతుల్లో సాగవుతున్న ముఖ్యమైన పండ్ల తోటలు అవకాడో, మామిడి, ఆలీ, ప్లమ్, పియర్, పిచ్, స్ట్రాబెర్రీ, బ్లూ బెర్రీ వంటివి, కూరగాయలలో లెట్యూస్, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి వాటిని పండిస్తూ ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు.

పోర్టబుల్ డ్రిప్ లేదా స్ప్రింక్లర్ విధానం

మల్చింగ్, రెజెడ్, బెడ్స్, నెట్, పాలీహౌస్ కింద సులభంగా నిర్వహించగలిగే పోర్టబుల్ డ్రిప్ లేదా స్ప్రింక్లర్ వంటి విధానంలో అధిక ఉష్ణోగ్రతల నుంచి నీటి వృధా కాకుండా తక్కువ ఖర్చుతో పండిస్తున్నారు. అక్కడి రైతులు సొంతంగా తామే పంట ఉత్పత్తులను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకుని సొంత బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసుకుంటారు. వ్యవసాయ ఉత్పత్తుల ఉష్ణోగ్రతను తగ్గించడానికి సహజ ఆఫ్‌సెట్ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. సీఓ–2 గ్యాస్‌ను ఉపయోగించి పంట ఉత్పత్తులను తక్కువ ఉష్ణోగ్రతల వద్ద నిల్వ ఉంచేలా చూస్తున్నారు. మొక్కల సస్యరక్షణ, పంటల నిర్వహణకు చెల్లింపు సేవా పద్ధతిలో ఒక ప్లాంట్ ప్రొటెక్షన్ ఇన్‌స్పెక్టర్ ఉంటారు. పంటను బట్టి ధర నిర్ణయిస్తారు. సీజన్‌కు హెక్టార్‌కు 40 డాలర్లు చెల్లిస్తారు. వారు పంటలను సందర్శించి చీడపీడల నివారణకు రైతులకు సూచనలు అందిస్తారు. ప్రభుత్వం రాయితీలుండవు. చాలా మంది రైతులు కీబుడ్జ్ విధానంలో అందరూ కలిసి కట్టుగా పంటలు సాగు చేసుకుని వచ్చిన దిగుబడిని సమానంగా పంచుకుంటారు. ఇది మన సహకార సంఘాలను పోలి ఉంటుంది. ఇందులో వసతి, భోజనాలు, పిల్లల చదువు అంతా కలిసే చూసుకుంటారు. మన ప్రాంతంలోనూ ఇజ్రాయిల్ తరహాలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలను పండించి లాభాలు పొందాలని ఆమె సూచిస్తున్నారు.

నందీశ్వరా.. నాలుగోసారి ఆశీర్వదించు

నందివనపర్తి శివాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు


నంది చెవిలో కోరికను చెబుతున్న మంచిరెడ్డి

యాచారం: నందీశ్వరా.. నాలుగోసారి నన్ను ఆశీర్వదిస్తే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినవుతానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంగళవారం నందివనపర్తి గ్రామంలోని నందీశ్వరుడికి మొక్కుకున్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎన్నికల సెంటిమెంట్‌లో ప్రతీసారి నందివనపర్తి గ్రామంలోని నందీశ్వరుడికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సీఎం కేసీఆర్ సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ప్రకటించడంతో ఆయన నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను మూడు సార్లు నందీశ్వరుడికి తొలి పూజ చేసిన తర్వాతే ఎన్నికల ప్రచారానికి వెళ్లానని గుర్తు చేశారు. తన సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశానని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని మరింత ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడమే తన జీవిత లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నందివనపర్తి సర్పంచ్ ఉదయశ్రీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వర్త్యవత్ రాజునాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

వ్యక్తి మృతి

కొత్తూరు: అతివేగంతో ప్రయాణిస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని వై జంక్షన్ కూడలిలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్(45) మంగళవారం తన బైక్‌పై కొత్తూరు నుంచి శంషాబాద్ వైపు ప్రయాణిస్తున్నాడు. వై జంక్షన్ కూడలి వద్దకు రాగానే అదే రూట్‌లో వేగంగా వస్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతికి కారణమైన కారు డ్రైవర్ సియాదత్ అలీకి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి బంధువు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ దొంగలకు రిమాండ్

- రూ.7లక్షల విలువైన ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్

పహాడీషరీఫ్: ఇళ్ల ఎదుట పార్క్ చేసిన వాహనాలను చోరీలు చేస్తున్న ఇద్దరిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. తుక్కుగూడలోని తన కార్యాలయంలో మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. తుక్కుగూడ ఓఆర్ఆర్ వద్ద మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు దొంగతనాల చిట్టా విప్పారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సంతోష్ కుమార్(20), పోతురాజు ముతురామన్(26), పెరుమాల్ రాములు బతుకుదెరువు నిమిత్తం మహేశ్వరం వచ్చారు. ఇక్కడ ఓ షెడ్డు అద్దెకు తీసుకుని చిప్స్ వ్యాపారం చేస్తున్నారు. వ్యసనాలకు బానిసలవ్వడంతో వచ్చే డబ్బు సరిపోక చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగానే పహాడీషరీఫ్, మహేశ్వరం, కందుకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లు, ఆటోలను మాస్టర్ తాళంచెవిలను వినియోగిస్తూ చాకచక్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. పెరుమాల్ రాము పరారీలో ఉండగా, మిగిలిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. మహేశ్వరం క్రైం టీం సాయంతో నిందితుల వద్ద నుంచి రూ.7లక్షల విలువైన ఏడు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలం

- ప్రతీ గ్రామంలో పాదయాత్రలు, సమీక్షలు నిర్వహిస్తాం
- పార్టీ బలోపేతానికి పనిచేసే వారికి తప్పక గుర్తింపు
- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మాల్ గ్రామంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: రాష్ట్రంలోని సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడంతో సీఎం కేసీఆర్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని మాల్ గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రతీ గ్రామంలో పాదయాత్రలు చేపడతానన్నారు. సమీక్షలు నిర్వహించి బలోపేతంపై దృష్టి పెడతానన్నారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తే విజయం నల్లేరుపై నడకేనన్నారు. ఈ మూడు నెలలపాటు పార్టీ శ్రేణులంతా ప్రజల్లో ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. అనంతరం ఇషా ఆస్పత్రి వైద్య బృందం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి ఇటీవల తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, జ్యోతినాయక్, రామకృష్ణ, మాల్ సర్పంచ్ కవిత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు అరవింద్‌నాయక్, రాజారెడ్డి, నారాయణరెడ్డి, శేఖర్‌గౌడ్, జంగీర్, శ్రీశైలం, సంపత్‌కుమార్, అమృతాసాగర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


విద్యార్థులకు సర్టిఫికెట్ అందించి కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని స్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో విద్యార్థులకు లీడర్ షిప్ ఎన్నికలు నిర్వహించారు. వేయి మందికి ఒక గ్రూప్ చొప్పున ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో లీడర్‌కు ఓటింగ్ ద్వారా బ్యాచ్‌లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించారు. క్రమ శిక్షణతో మెలుగుతూ ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హరేందన్ స్వామీజీ, సరల్ స్వామీజీ, పాఠశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శ్రీధర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనంతరెడ్డి, నాయకులు శ్రీహరియాదవ్, జేవంతు తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు చోరీ

నందిగామ: బోరు మోటారును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు జంగిలి ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. అక్కమ్మ చెరువు సమీపంలోని తన వ్యవసాయ పొలంలోని బోరు మోటారును ఈ నెల 17న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. 18న ఉదయం మోటారు ఆన్ చేసేందుకు వెళ్లగా పనిచేయలేదు. దీంతో పరిశీలించగా పైప్‌తో సహా కేబుల్‌ను కట్ చేసి మోటార్ ఎత్తుకెళ్లారు దీని విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని వివరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఈ విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ సురేశ్‌ను వివరణ కోరగా గ్రామంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మొయినాబాద్: గండిపేట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ ఏపీ రంగా తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ పక్కనున్న గండిపేట చెరువులో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. సోమవారం రాత్రి చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9491039043 సెల్ నంబర్‌లోగానీ మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లోగానీ సంప్రదించాలన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కుటుంబ పాలనకు చరమగీతం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మంగళూరు ఎమ్మెల్యే వేదవ్యాస కామత్

కొత్తూరు: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పేరిట సీఎం కేసీఆర్ సాగిస్తున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని కర్ణాటక రాష్ట్రం మంగళూరు సౌత్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వేదవ్యాస్ మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రవాస్‌యోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న సాయం... మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్శిస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధిని మరిచిన బీఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీలపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు మాత్రమే రాష్ట్రాన్ని పాలిస్తూ ప్రజా సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. నాయకులు విజయ్‌కుమార్, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబ య్య, మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహాగౌడ్, నాగరాజు చారి, మహేందర్‌రెడ్డి, రణధీర్ గౌడ్, మల్లేశ్, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని బలిగొన్న లిఫ్ట్ గుంత

హయత్‌నగర్: నిర్మాణంలో ఉన్న భవనానికి లిఫ్ట్ కోసం తీసిన గుంత బాలుణ్ని కబళించిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది . పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా పాతర్లపాడుకు చెందిన వి.సైదులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మన్సూరాబాద్ డివిజన్‌లోని ఆదర్శనగర్ కాలనీలో ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తూ అక్కడే నివాసమంటున్నాడు. ఆయన కొడుకు రాఘవేందర్ (7) సోవారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి వస్తూ ఆదర్శనగర్‌లో నిర్మాణంలో ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్న బంధువుల పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో నిర్మాణంలో ఇంటి వద్ద లిఫ్ కోసం తవ్విన గుంతలో పడ్డాడు, అందులో ఉన్న నీటిలో మునిగి మృతి చెందాడు. బాలుడి కోసం కుటుంబ సభ్యులు వెతకగా.. గుంతలో శవమై కనిపించాడు. లిఫ్ట్ కోసం తీసిన గుంత చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం, అందులో నీటిని తొలగించకపోవడంతోనే ఈ దుర్ఘటనకు కారణమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.